కథ

# అదృష్టదేవత

**- గడపల రవి**

"ఒరేయ్! నాలుగు లక్షలు దెబ్బతో ఒళ్ళో వాల్తోందిరా! అదృష్టదేవత తలుతడుతోంది. లేచిరారా" అందున్నాడు వరదాచారి.

వాడు వరదలా ఎప్పుడు ప్రవేశించాడో తెలియదు. వచ్చీ రావడంతో గట్టిగా అరుస్తున్నాడు. ఇంట్లో అందరు వారి వారి పనులు వదలి వరదాచారి వైపు తిరిగారు. వాడిదేదీ గమనించేలా లేదు. వాడి ప్రపంచంలో కేవలం నేను మాత్రం కనిపిస్తున్నాను. వాడి కంటికి ఎవరూ ఆనడంలేదు.

నేరుగా వచ్చి ఎదురుగా కూర్చున్నాడు. వాడి కళ్ళు వెడల్పు అయి దివ్యంగా వెలుగుతున్నట్లుంది. ఏదో చెప్పడానికి తీవ్రంగా ప్రయత్నిస్తున్నట్లుంది. మరో వైపు వాడి వాలకం చూస్తే నాజేబుకు చిల్లి పెట్టేట్లున్నాడు.

"మరి ఆమెనెందుకు వదలి వచ్చావు?" అన్నాను.

"ఆమె ఎవరు?"

"అదే అదృష్టదేవత"

"ఒరే జోకులెయ్యకురా. ముందు యీ దేవుడు కరుణిస్తే అవతల అదృష్టదేవత నాయింట్లో ప్రవేశించటానికి రెడీగా వుంది. రెండు వేలిచ్చావంటే, ఇరవైవేలు తిరిగిస్తా" నంటున్నాడు.

" వందలకు పరిమితమైనవాడివి వేలకు వచ్చావా! యిలా ఎన్నిసార్లు తీసుకుపోలేదు నువ్వు. తీసుకుపోవడమే గాని తిరిగి ఎప్పుడైనా యిచ్చావా? అయినా నీకు ఇంకా ఇంకా బుద్ధి రాలేదా? వున్నదానితో తృప్తిపడరా. అంతా, ఆ గుర్రాలకే తగలబెడుతున్నావు. చిప్పవుచ్చుకొని అడుక్కు తింటావు జాగ్రత్త" అన్నాను కటువుగా.

"లేదురా నా కళ్యాణిని గురించి నీకు తెలియదు. కళ్యాణి ట్రాక్ మీదుంటే కనక వర్షం కురిసినట్లే. ఏ లెగ్ లో ఏ హార్స్ వస్తుందో ఖచ్చితంగా చెప్పగలను. హార్స్ పేరు, వాటి ట్రైనీ, జాకీ, ఏజ్ అవి ఎక్కడెక్కడ పార్టిసిపేట్ చేసింది, ఎంత టైంలో అవి పరుగెత్తేది, ఎన్ని షీల్డ్స్ గెలుచుకుంది, అన్ని రికార్డ్స్ నా దగ్గర వుంది. ట్రాక్ మీద ఏ లెగ్‌లో ఎవరు వస్తారో ఖచ్చితంగా వర్కవుట్ చేసాను. చూడు యీ సారి నాగురి తప్పదు".

అని కొన్ని కాగితాలు నా ముందు వేసాడు. గుర్రప్పందాలలో వాటిగురి అటుంచితే వాటి థియరీతో నన్ను లొంగదీసుకునే గురి మాత్రం తప్పలేదు. ఫలితం రెండువేలు నా జేబు నుంచి మాయం అయి వాడి చేతుల్లోకి పోయింది. తక్షణం వాడు మాయం.

వాడు వెళ్ళిపోయిన తర్వాత వాడికి డబ్బు యిచ్చి వుండకూడదనిపించంది. అనవసరంగా నేనే వాడ్ని చెడువుతున్నానని ఫీలింగ్. వాడ్ని నేను చెడపడమేంటి? బోడి నేను కాకపోతే మరో వెధవ దగ్గర వుచ్చుకుంటాడు. కాని వాడన్నట్లు ఆ నాలుగు లక్షలు వస్తేనయినా గుర్రప్పందాల జోలికి పోడేమోననుకుంటా.

వరదాచారి నేను బాల్య స్నేహితులం. వాడిది మేథమెటికల్ బ్రెయిన్. దానికి తోడు ఆడిట్ డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగం. పెద్దగా పనిలేని డిపార్టిమెంట్. పైగా చేతినిండా చిల్లర అవడంతో వాడి పనితనం అంతా యిలా చూపుతుంటాడు. చేతికి వచ్చిన చిల్లరే కాకుండా జీతం కూడా గుర్రపందాలకే ధారబోసిన సందర్భాలెన్నో. అయితే మాటకారి అవటంతో సంసారం వీధి నపడలేదు. నెట్టుకొస్తున్నాడు.

వాడు బ్రాహ్మడైనా ఏనాడు గుడికి వెళ్ళడం చూడలేదు. పైగా తాగుబోతు, పేకాట కూడా. మందు కొట్టినప్పుడు మాంసం నంజుకుంటాడు. ఒక్క మందు కొట్టినప్పుడే ఏమిటి కోరుకున్నపుడల్లా లాగిస్తుంటాడు. నేను ఆ బ్రాహ్మణ్ణైనా ఒకటి రెండు మాంసాలే ఎరుగుదును. కాని వాడు కాకి, గ్రద్ధ, పులి, పిల్లి మాంసాలు తప్ప సమస్తం రుచి చూసిన వాడు.

డబ్బు సులభంగా సంపాదించాలని వాడి వుబలాటం. జీవితం దర్జాగా గడపాలంటాడు.

ఇక నావిషయానికి వస్తే నేను లక్షలు పోగుచేసుకోలేదు గాని, వున్న ఉద్యోగంతో నిజాయితీగా పని చేస్తూ వున్నదాంతో సర్దుకపోతూ, అప్పులు గట్రా లేకుండా సంసారాన్ని యీదుకొస్తున్నా.

వరదాచారి నానుండి డబ్బు తీసుకుపోయి నవాడు మళ్ళీ రెండు రోజుల తరువాత ఇంటికొచ్చాడు. చెంత పెద్ద సంచీ వుంది. అందులోని కాగితాలు రేసు బుక్కులు నా ముందుంచి మళ్ళీ డబ్బు గుంజుతాడేమోనని భయపడ్డా.

కాని సంచీ బోర్లించాక నోట్లకట్టలు టేబుల్ పై కుప్పగా పడింది. ఇది కలా! నిజమా! అర్థం కాలేదు. నా కళ్ళు గిర్రున తిరిగినట్లయి తమాయించుకున్నా. డబ్బు వాసన గదంతా పరచుకుంది.

"నువ్వన్నట్లు అదృష్టదేవత నీ ఇంటికే వచ్చినట్లుందే" అన్నా.

"ఆహా ఆమెని చిటికె వేసి మరీ వెంటబెట్టుకొచ్చా. అందుకే జాక్‌పాట్ కొట్టింది."

"వాడు కాలిపై కాలువేసుకొని దర్జాగా కూర్చున్నాడు." చూసావా యీ వరదాచారి గురి తప్పలేదు. యిన్నాళ్ళకు నా కల ఫలించింది. నా కళ్యాణి నన్ను వరించింది. మొదటి లెగ్ నుంచి చివరి లెగ్ వరకు నా లెక్క తప్పలేదు. అన్నట్లుగానే కళ్యాణి ముందొచ్చింది. ఆరోజు బెట్టింగ్‌లోని కలెక్షన్ అంతా మనకే. ఇంకో లక్ష ఎక్కువే వచ్చింది. అంటున్నాడు.

ప్రపంచాన్నే గెలిచినట్లుంది. వాడి ఫీలింగ్ గుర్రప్పందాల్లో ప్రపంచాన్నే శాసించేలాగున్నాడు.



వాడి తెలివికి సంతోషించాలో ఏడవాలో తెలియలేదు. ఈ ఐదు లక్షలు రావడానికి వాడు గత 15 సంవత్సరాలుగా దారబోసి వుంటాడు. అదేదీ తట్టడంలేదు వాడికి. వాడి ధోరణిలో వాడున్నాడు. ఆనందంతో వెలిగిపోతున్నాడు.

ఈ రేసుకు వెళ్ళే వాళ్ళంతా అంతే. సంవత్సరాల తరబడి ఆడతారు. ఎప్పుడో అదృష్టం బాగుండి కొంత డబ్బు వస్తుంది. దాంతో సంతోషపడిపోయి మితిమీరి జల్సా చేస్తారు. కాని అంతకు ముందు వారు ఎంత దారబోసుకున్నారనే గమనించరు. గమనిస్తే యీ వ్యసనానికి దూరంగా వుంటారేమో. పోనీ ఆ వచ్చిందాంతో సుఖపడతారా! అంటే అదీ లేదు. ఆ వచ్చిన డబ్బంతా మళ్ళీ ఆ గుర్రాల కాళ్ళ కింద పోస్తారు. ఆ గుర్రాలు రేపే దుమ్ము నోట్లో పడ్డం తప్ప మిగిలేది శూన్యం.

"formuch కనిపెట్టేరు. ఇక చూస్కో ఆడినప్పుడల్లా లక్షలే లక్షలు. చూస్తూవుండు నీ ముందే కోటీశ్వరుడ్నవుతా. మిద్దెలు, కార్లు ఒకటేమిటి సర్వం నాకాళ్ళ ముందుంటుంది. అదృష్టదేవతను వదలనురా. ఇంట్లో బంధించి వుంచుతా" అని అవాకులు చవాకులు పేలుతున్నాడు, వరదాచారి.

అదిగో నేననుకున్నానా మనుషులు వచ్చిందాంతో తృప్తి పడరని. ఆశకు అంతెక్కడ. తృప్తికి తావెక్కడ. మళ్ళీ వెళ్తాడా పందాలకి వాడి ఖర్మ అనుకున్నా.

వాడనట్లుగానే 20 వేలు ఇచ్చి డబ్బు కట్టలు పట్టుకెళ్ళిపోయాడు. వాడా మాటలు వింటుంటే యిదివరకొకసారి యిదే విధంగా మాట్లాడటం గుర్తొచ్చింది. కాని అప్పటి సిట్యువేషన్ వేరు. అప్పుడు, అంటే సుమారు 15 సంవత్సారాల క్రితం యిలాగే వీడు కాటన్ గేమ్ ఆడి 80 వేలు గెలిచాడు. ఆ తరువాత అంత పెద్ద మొత్తం యిదే.


ఆ రోజులు నాకు బాగా గుర్తు. వరదాచారి కాటన్ పై బెట్టింగ్ ఆడేవారు. న్యూయార్క్ లోని కాటన్ మార్కెట్ లోని ప్రతిరోజు ఓపెనింగ్, క్లోజింగ్, రేట్స్ అనుసరించి ప్రపంచం అంతా అదే రేట్లను అటుయిటుగా మార్కెట్ చేసేవారు. ఒక విధంగా చెప్పాలంటే న్యూయార్క్ కాటన్ మార్కెట్ ను ఒక స్టాండర్డ్ గా తీసుకొని ఫాలో అయ్యేవారు. ఈ ఓపెనింగ్, క్లోజింగ్ రేట్లు మరుసటిరోజు పేపర్‌లో వచ్చేవి. దాన్ని ఆధారం చేసుకొని ఆ మరుసటిరోజున ఓపెనింగ్ క్లోజింగ్ రేట్లను వూహించి bething ఆడేవారు. ఇది ప్రతిరోజు ఒక తంతు. ప్రతి చిన్న అంగళ్ళోనూ ఏజెంట్లు వుండేవారు. వాడి దగ్గర ఓపెనింగ్ నెంబర్ (ఒక అంకె) మరియి క్లోజింగ్ నంబర్ (ఒక అంకె) కలిపి రెండంకెల సంఖ్య రాసి సాయంత్రంలోగా యివ్వాలి. అలా bething అయ్యింతర్వాత రాత్రి 8 గంటలకు ఆరోజు ఓపెనింగ్ రేట్లలోని చివరి అంకె, క్లోజింగ్ రేటులోని చివరి అంకె కలిపి రెండంకెల సంఖ్య ప్రకటించేవారు. రెండూ కరెక్ట్‌గా వస్తే ఒక రూపాయి బెట్ కాసినవారికి 7 రూపాయలు చొప్పున లెక్కకట్టి యిచ్చేవారు. ఈ కాటన్ ఆట తిరుపతి, చిత్తూరులలో ఒక ఉన్మాదంలా వుండేది.

భర్తలకు తెలియకుండా భార్యలు కూడా పిల్లల చేత రాసి పంపి బెట్టింగ్ చేసేవాళ్ళు. ఇక ఆ కాటన్ ఆటకు ఎంత క్రేజ్ వుండేదో మీరే గమనించండి. ఆ ఆటను ఎంత పిచ్చిగా ఆడేవారంటే ఆ ఓపెనింగ్, క్లోజింగ్ నెంబర్లను రోడ్లపై, గోడలపై రాసేవారు. మనుషులు గ్రూపులుగా చేరితే సబ్జెక్ట్ ఇదే. వాళ్ళకు తోచిన ఫార్ములా తో లెక్కలు వేసేవాళ్ళు. కాని గెలిచేది తక్కువే.

వరదాచారి అప్పటికే జూదం, మట్కా అనే వేరే ఆటల్లో ఆరితేరి వదలివేసాడు. ఎందుకంటే అవి ఇల్లీగల్ గేమ్స్ ఆట. పోన్లే మనవాడు. డబ్బు సంపాదన లీగల్‌గా వుండాలని అనుకున్నట్లున్నాడు.

అలా కాటన్ ఆట ప్రబలంగా వుండే రోజుల్లో మనవాడు అంతో యింతో సంపాదించేవాడు. నే నొక రోజు వాడ్నడిగా "ఎందుకురా ఈ బురదలో దిగావు" అని.

"మొదట్లో మట్కా అనుభవంతో ఏదో ఒక నంబరు నోటికొచ్చింది అడిగినవారికి చెప్పేవాడిని. చిత్రంగా అవే నంబర్లు కాటన్‌లో తగిలేవి. మని నేనెందుకు ఆడకూడదని




యిందులో దిగాను. అలా మొదలు పెట్టాను. పెద్ద మొత్తం ఇంకా సంపాదించలేదు." అన్నాడు. వరదాచారి.

ఒకరోజు వాడు నా దగ్గర కొచ్చి "ఈ కాటన్ కమామిషు కనిపెట్టేశా. ఇక చూడు వేలకు వేలు మన సొంతం" అన్నాడు.

"ఎలా కనిపెట్టావురా" అడిగా

"పాత పేర్లు తరగేసి, మేథమెటికల్ కేలుక్యులేషన్స్ చేసి ఒక సంవత్సరపు న్యూయార్కు కాటన్ రేట్లను పరిశీలించి, మరుసటి రోజు ఓపినింగ్, క్లోజింగ్ రేట్లను చెప్పగలుగుతున్నాను. ఉదాహరణకు రేపు ఓపినింగ్ అంకె 3, క్లోజింగ్ అంకె 3. రెండూ కలిపి 33 అని ఆడబోతున్నా. ఈ అంకెను నాకు తెలిసిన ఫ్రెండ్స్ అందరికీ యిస్తున్నా. నీవు కూడ యీ నంబర్ మీద ఆడు గెలుపు ఖాయం" అన్నాడు.

వాడు అన్నంత పనీ జరిగింది. 70wnలో ఎక్కడ చూసినా అదే నంబర్‌మీద bething జరిగింది. ఆరోజు రాత్రి రిజల్ట్సు ప్రకటించారు. అదే నంబర్ వచ్చింది. కాసిన ప్రతి ఒక్కరికీ వందలు, వేలలో డబ్బు వచ్చింది. దీంతో తిరుపతి, చిత్తూరు టౌన్‌లో కాటన్ కంపెనీ దివాళా తీసింది. మళ్ళీ కోలుకోలేదు.

ఆరోజు వరదాచారికి డబ్బు వరదలా వచ్చి పడింది. అంతా సుమారు 80 వేలు వచ్చింది. వాడికి ఫ్రెండ్స్ సర్కిల్‌లో పెద్ద హీరో అయిపోయాడు. కాని ఆ డబ్బు ఎక్కువ కాలం నిలువలేదు.

అప్పుడే వీడికి కొత్త జబ్బు పట్టుకుంది. ఇంకొద్ది గొప్ప ఆట, గుర్రప్పందాలాట మొదలు పెట్టాడు. అది త్వరగా డబ్బు పోగొట్టుకునే మార్గం. అంత డబ్బుంటే వాడికి బరువుగా వుండేదట. మొత్తం పోయి గుర్రాలకు చేరిపోయింది.

అప్పటి నుంచి ఇప్పటిదాకా ఆ గుర్రాల పిచ్చి పట్టుకుంది వాడికి.

ఇప్పుడు వాడు మాట్లాడిన మాటలు పాత జ్ఞాపకాలను తోడింది.

అలా ఐదు లక్షలు సంపాదించిన వరదాచారి తిరిగి నాకు మూడు నెలలు గడచినా కన్పించలేదు. వాడికి నా అవసరం లేదు. అదృష్టదేవత వెంట తెచ్చుకున్నాక నాతో ఏంపని. వాడ్నొకసారి చూడాలనిపించింది.

వాడి యింటికేసి వెడుతుంటే వాడన్నట్లు కోటీశ్వరుడైపోయాడా? పాత యింటి స్థానంలో పెద్ద బంగళా వెలుస్తుందా! మరి యిల్లు గుర్తు పట్టగలనా? అయినా మూడు నెలల్లో యిల్లు ఎలా మరచిపోగలను? నాపిచ్చిగాని. డబ్బుంటే యిల్లు కట్టడం ఎంతసేపు. చిటికెలో అయిపోదూ.

నా ఆలోచనలు యిలా సాగుతుంటే వాడి యిల్లు వచ్చింది. అదే పాత యిల్లు. కనీసం యింటికి వెల్ల వేసిన ఆనవాళ్ళు కూడా లేదు. ఇంట్లో అడుగు పెట్టా.

వరదాచారి సతీమణి ఆహ్వానించంది. యింట్లోకి "రండన్నయ్యా, ఆయన స్నానం చేస్తున్నారు. కూర్చోండి. ఏంటి యీ పక్కకు రావడం మానేశారు.? ఊళ్ళోగానీ లేరా?" అని అడిగింది.

"ఊళ్ళోనే వున్నాగానీ, వీడే బిజీగా వుంటాడని రాలేదు. సరే గాని యింట్లో మార్పే కనిపించడంలేదు, అదృష్టదేవతను గాని తరిమేశాడా ఏంటి?"

"మీరు గూడా పరాచికాలాడితే ఎలాగన్నయ్యా? ఆ డబ్బు తెచ్చిన రోజున చూసాను. అంతే లోపల దాచి రోజూ కాసింత తీసుకుపోయేవాడు. ఇప్పుడు పైసా లేదు. నాకు పట్టుచీర కాదు గదా కనీసం జాకెట్టు ముక్కైనా కొనలేదు. పోనీ యింటి జాగా కొన్నారా అంటే అదీ లేదు. డిపాజిట్ చేశారా అంటే అదీ లేదు. ఆ డబ్బు ఏమైందో తెలియదు. మీరైనా ఒక మాట చెప్పరాదూ. డబ్బులు అలా తగలెయ్యటం మానుతారేమో" అంటూ ఆమె కన్నీళ్ళు పెట్టుకుంది.


ఇంతలో వరదాచారి వచ్చాడు. "ఏంటిరా ఇన్నాళ్ళు ఏమయిపోయావు? కనబడ్డం లేదు?" అన్నాడు.

"నీవు లక్షాధికారి వయ్యావుగదా, కళ్ళు నెత్తికెక్కి వుంటుందని నేనే రాలేదు. ఏంటీ మొత్తం మళ్ళీ పూడ్చి పెట్టుకుపోయిందా? వచ్చిందాంట్లో కొంత పిల్లలపేర డిపాజిట్ చేసి మిగిలింది నీవు జల్సా చేసి వుండవలసింది. యిదేంటి మళ్ళీ మొదటి కొచ్చింది పరిస్థితి? ఇలా అయితే ఎప్పుడు చక్కబడుతుంది సంసారం. ఏం చేసావు ఆ డబ్బునంతా?"

"ఒరేయ్, ఏం చేసానని అడక్కు. యిప్పుడు నేను కొత్త ఫార్ములా కనిపెట్టాను. దాంతో ఆడితే నో లాస్ నో గెయిన్ లేకపోతే జాక్‌పాట్ తప్పదు. అంటే వస్తే లక్షలు లేకుంటే లాస్ లేదన్నమాట. అయినా అదికూడా యిప్పుడు అడ్డం లేదు. చాలా తగ్గించేసా. అంతకన్న ఇప్పుడు సులువుగా సంపాదించే మార్గం కనిపెట్టా. వస్తానుండు." అని లోపికెళ్ళి ముందు పవిత్ర గ్రంథాల్లాంటి పుస్తకాలు తెచ్చాడు. వాటిని తెరచి చూసాను నాకు మతిపోయింది. దాన్నిండా లాటరీ టిక్కెట్లు అతికించి వున్నాయి. పేజీల కొద్దీ ఎన్నో రకాల లాటరీ నెంబర్లు రాసివుంది. అస్సాం, సిక్కిం, భూటాన్, ఆంధ్ర, తమిళనాడు లాటరీల నెంబర్లు రాసివుంది.

వాడికేసి పిచ్చోడ్ని చూసినట్లు చూసా. చిత్రమేమిటంటే వాడు కూడా నాకేసి పిచ్చివాడ్ని చూసినట్లు చూస్తున్నాడు.

"అరే పిచ్చోడా లాటరీల మీద రీసెర్చి చేస్తున్నా. యిపుడిపుడే ఒక ఫార్ములా తడుతోంది. యీ పుస్తకాల నిండా ఏమనుకున్నావు? రెండు నెలలుగా కష్టపడి లాటరీల రిజల్టు సేకరించి రికార్డు చేస్తున్నా. వీటిని పరిశీలిస్తుంటే రిజల్టు ఒక పద్ధతి ప్రకారం ప్రకటిస్తున్నట్లుంది. ఆ పద్ధతేంటనేది త్వరలో తెలుస్తుంది. ఆ ప్రక్రియ చూస్కో ఫస్ట్ ప్రైజ్‌లే కొడుతుంది మనకు.




ఒక్కో ప్రైజ్ ఎంతనుకున్నావు? 20 లక్షలు, లేదా 30 లక్షలు. ఈ రేసుల్లో ఒకసారి జాక్‌పాట్ కొట్టినా 5 లక్షలు మించదు. కాని ఇందులో అలా కాదు. మనం జీవితంలో అంత డబ్బు చూడలేం. ఏమంటావు?" అంటున్నాడు.

నేను వాడికి చెప్పదలుచుకున్నది వేరు వాడు మాట్లాడుతున్న టాపిక్ వేరు. వాడి వాక్ప్రవాహానికి నేను కొట్టుకుపోతున్నా. నా మెదడు తినేస్తున్నాడు. నాకు తెలియకుండా నేనే వాడి దారికొచ్చేసా.

"అంత ఖచ్చితంగా ఎలా చెప్పగలవు?" అడిగా. "వరదాచారి ఏదీ థియరాటికల్‌గా చెబుతూ, అన్నీ ప్రాక్టికల్ గానే చెబుతాడు. ప్రస్తుతం నేను నావద్ద నున్న ఫార్ములా వర్క్ ఔట్ అవుతుందో లేదో నని చూస్తున్నా. ఇప్పుడు లాటరీ టిక్కెట్టు రిజల్టు చివరి నాలుగు అంకెలు ఏది వస్తుందో చెప్పగలుగుతున్నాను. ఫలితంగానే నేను రూపాయి పెట్టి కొన్న లాటరీ టికెట్టుపై రూ.20 నుంచి రూ.50 వరకు వస్తూంది. చివరి 5 అంకెలు చెప్పగలిగితే ఒక్కోటిక్కెట్టుపై రూ.100 నుంచి రూ.1000 దాక వస్తుంది. అలా ఫార్ములా సక్సెస్ అయిందంటే మొదటి బహుమతి ఏ టిక్కెటుకు వస్తుందో, ఖచ్చితంగా చెప్పగలను. అలా మొదటి బహుమతి నెంబర్లు గల టిక్కెట్టులే కొంటే ప్రతిసారీ 20 లక్షలు, 30 లక్షలు వస్తుంది. ఆ రోజులు ఇంకెంతో దూరం లేదు. నెల చాలు. ఆ ఫార్ములా 'మనచేత వుంటుంది" అన్నాడు.

నేనే పిచ్చివాడ్నయ్యా. వీడు అన్నంతపనీ చేస్తాడనిపించింది. అయినా వీడిది నిలకడలేని మనస్తత్వం. డబ్బు సంపాదన ఎటు సులభం అనిపిస్తే అటు మొగ్గుతున్నాడు. రేప్పొద్దున వీడు రాజకీయాల్లో చేరినా ఆశ్చర్యపోనవసరం లేదు. ఎందుకంటే ప్రపంచంలో అత్యంత సులువుగా కష్టపడకుండా డబ్బు సంపాదించే మార్గం అదొక్కటే కనుక. వీడు ఎక్కడున్నా డబ్బున్న రోజే రాజు, మరుసటి రోజు బికారి. రేపటికోసం ఏది వుంచుకోడు.

వీడికి డబ్బు పిచ్చి పట్టింది. ఇక వీడ్ని మార్చలేం అనిపించింది. ఇంటికి వచ్చేసా. ఎద్దును బలవంతంగా కుడితి దగ్గరకు తీసుకుపోగలం గాని దానిచేత కుడితిని తాగించలేం. దానికి దాహం వేసినప్పుడే అది తాగుతుంది.

ఇది గడచిన రెండు నెలలకి వరదాచారి యింటికి వెళ్ళాల్సొచ్చింది. వెళుతుండగా రెండు నెలల ముందు వాడి యింటికేసి వెళుతున్నప్పుడు వచ్చిన ఆలోచనలే మళ్ళీ వచ్చాయి. ఇల్లు దగ్గర పడింది. కాని యింట్లో మార్పేంలేదు. అదే యిల్లు. అదే పాత యిల్లు.

ఇంట్లోకి అడుగుపెట్టా. ఇంటి మధ్యలో కూర్చొని ఆలోచనల్లో మునిగి వున్నాడు వరదాచారి. వాడ్ని తెలిసినప్పటినుంచి వాడు ఖాళీగా కూర్చోవడం యిదే మొదటిసారి.

"వరదా...ఏంట్రా అలావున్నావు? ఏ మైంది నీ సైంటిఫిక్ ఫార్ములా?" అన్నాను వ్యంగ్యంగా?

వాడు నాకేసి చూసి ఓ చిరునవ్వు నవ్వి మొదలు పెట్టాడు. సమస్త వేదశాస్త్రాలను ఆకళింపు చేసుకొని జీవిత సత్యాన్ని కనుగొన్న వేదాంతిలా వుందానవ్వు.

"నా ఫార్ములా తప్పలేదురా. నేను ముందే చెప్పాను. వరదాచారి ప్రాక్టికల్‌గానే చెబుతాడని. నా లెక్కలు తప్పలేదు. నేను వంద శాతం పర్‌ఫెక్ట్ అంటున్నాడు.

మరి యీ మౌనమేంటి? ఈ పాత ఇల్లు ఏంటి? వీటి లెక్కలు తప్పలేనప్పుడు వీటి ఆర్థిక పరిస్థితి ఎందుకు మారలేదు? ఆ సంపాదన వద్దనుకున్నాను? ఏం జరిగిందసలు? ఇలాంటి ప్రశ్నలు శరవేగంగా నాలో పుట్టుకొచ్చాయి. కాని నేను నోరు మెదిపేలోగా అన్నింటికి వాడే సమాధానమిచ్చాడు.

"నేను మొదట్లో నా లెక్కల ప్రకారం లాటరీ టిక్కెట్టులోని చివరి నాలుగంకెలు ఏ సిరీస్‌లో వచ్చేవో చూసి కొనేవాడ్ని. అందుకోసం లాటరీ ఏజెంటును మచ్చిక చేసుకొని లాటరీ టిక్కెట్లు రాగానే ముందు కబురు అందే విధంగా ఏర్పాటు చేసుకున్నా. నేను వెళ్ళి మొదట నాకు కావలసిన సిరీస్‌లో కావలసిన చివరి నాలుగంకెల టిక్కెట్లు కొనేవాడ్ని. నాకు ఒక్కోటిక్కెట్టు మీద రూ.20 నుంచి రూ.50 దాకా 10 లేదా 20 టిక్కెట్లకు లాటరీ తగిలేది. అలా పెరుగుతూ 500 రూపాయల దాకా వచ్చేది. ఆ తరువాత చివరి ఐదు అంకెల సిరీస్ గల లాటరీలు నాకు 10 కంటే ఎక్కువ దొరికేవి కావు. తర్వాత 500 రూపాయల చొప్పున ఒక్కొక్క టిక్కెట్టు వచ్చేది."

చివరి ఆరు అంకెలు గల టిక్కెట్లు టౌన్ అంతా గాలించి ఒకటి లేక రెండు కొనగలిగితే వాటిద్వారా ఒక్కోటిక్కెట్టు పై రూ.1000నుంచి రూ.2000 వచ్చేవి. కాని ఆ తరువాత నంబర్లకే అసలైన బంపర్ ప్రైజులు తగిలేవి. అవి ఒక్కోటి 20 వేల నుంచి లక్ష, అటు తరువాత లక్ష నుంచి 20 లక్షల దాక వుంటుంది. ఆ సిరీస్ గల టిక్కట్లకు ఖచ్చితంగా లాటరీ తగులుతుందని తెలిసినా అవి నాకు దొరికేవి కాదు."

"ఇప్పటికీ నేను మొదటి బహుమతి రాగల లాటరీ టిక్కెట్ల నంబర్లు ఖచ్చితంగా చెప్పగలను. కాని ఆ నంబరుగల లాటరీ టిక్కెట్ దేశంలో ఏ ఏజెంటు దగ్గరుంటుందో తెలుసుకోలేం. అక్కడికి వెళ్ళి తెచ్చుకొనలేం. ఒకటి మాత్రం బోధ పడింది."

"ఆ లాటరీ టిక్కెట్టు ఎవరు కొంటారో వాడే అదృష్టవంతుడు. అదృష్టదేవత ఎవర్ని వరించిందో వాడికే దొరుకుతుంది ఆ లాటరీ టిక్కెట్టు. మనం ఎన్ని లెక్కలు వేసినా శుద్ధ వేస్టు. అందుకే అదృష్టవంతుల ఎంపిక అదృష్ట దేవతకే వదిలివేసి నా లెక్కల్ని అటకెక్కించా."